క్లుప్తంగా

గాన గంధర్వ ఘంటసాల పద్యకావ్యం ఆవిష్కరణ



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం కవిరత్న డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ రచించిన గాన గంధర్వ ఘంటసాల పద్యకావ్యం ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభకు విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, విశ్రాంత అధికారి మద్దు వెంకటస్వామి పాల్గొని ఘంటసాల పద్యకావ్యాన్ని ఆవిష్కరించారు. గాయకులు తాళ్లూరి సుధీర్, గాయత్రీ పలు సినీ గీతాలను ఆలపించారు. విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ వి.సింగారావు పాల్గొన్నారు.

28 వరకు లేపాక్షిలో థిమేటిక్ ఎగ్జిబిషన్



పాత గుంటూరు: బ్రాడీపేటలోని లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో నిర్వహిస్తున్న థిమేటిక్ ఎగ్జిబిషన్‌లో చేతివృత్తుల వారు తయారుచేసిన వస్తువులను రాయితీలపై విక్రయిస్తున్నట్లు మేనేజర్ ఎంవీఎస్ కుమార్ తెలిపారు. ఎగ్జిబిషన్‌లో కొండపల్లి బొమ్మలు, టి.కొప్పాక బొమ్మలు, లెదర్ వస్తువులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 28వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నగర ప్రజలు లేపాక్షిని సందర్శించాలని కోరారు.

ముస్లిం సమాజానికి పెమ్మసాని క్షమాపణ చెప్పాలి



పట్నంబజారు: పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా దేశం కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసిన సద్దాం హుస్సేన్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తక్షణమే ఆయన చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని, ముస్లిం సమాజానికి క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై.షేక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్.అగ్రహారంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెమ్మసాని అమెరికా దేశ సంస్కృతిలా అక్కడి పిస్టల్ సంస్కృతి ఇక్కడకు తీసుకు రావాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి ప్రజలు సోదర భావంతో ప్రశాంతంగా ఉంటున్నారని తెలిపారు. ఎన్డీఏ కూటమి దేశానికే అత్యంత ప్రమాదకారి అని, అటువంటి మతతత్వ పార్టీతో టీడీపీ జత కట్టి ముస్లింలను అణగదొక్కాలని కంకణం కట్టుకుందన్నారు. తన ప్రసంగాల ద్వారా పెమ్మసాని తన నిజస్వరూపాన్ని బయటపెట్టారని విమర్శించారు. తక్షణమే ముస్లింలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ సేవ

పాత గుంటూరు: ఆర్.అగ్రహారం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన, నిత్య హోమం, విశేష హోమం, బలిహరణం తదితర కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం ఆరాధన, సహస్ర దీపాలంకరణ సేవలో భక్తులు భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శులు పాత కోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు తదితరులు పర్యవేక్షించారు.

ముగిసిన వేంకటాచలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: నందివెలుగు రోడ్డు వస్తనగర్‌లో వేంచేసియున్న పద్మావతీ, గోదాదేవి సమేత కామ్యసిద్ధి వేంకటాచలస్వామి దేవస్థానం అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు దీవికృష్ణ బాలాజీ, శ్రీనివాసుల లక్ష్మీనరసింహాచార్యులు నిర్వహణలో ఉదయం స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ నైవేద్యాలతో స్వామిరూపాన్ని చిత్రించే తిరుప్పావడ సేవ భక్తులను అలరించింది. విశేషంగా పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వేలాదిమంది భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శి ఎంవీ శేషగిరిరావు, మద్దినేని నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు పర్యవేక్షించారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

నగర కమిషనర్, ఈస్ట్ ఆర్వో కీర్తి చేకూరి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన నగర కమిషనర్, ఈస్ట్ ఆర్వో కీర్తి చేకూరి

నెహ్రూనగర్: రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలు చేయాలంటే తప్పనిసరిగా 48 గంటల ముందే దరఖాస్తు చేసుకుని, అనుమతి పొందాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, పశ్చి నియోజకవర్గ ఆర్వో, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ప్రచార ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలు చేపట్టడానికి 48 గంటల ముందే రిటర్నింగ్ అధికారి నుంచి తగిన అనుమతులు పొందాలని, అందుకు తగిన విధంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు వేరువేరుగా సింగిల్ విండో కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, లౌడ్ స్పీకర్ల వినియోగం, బోర్డులు, బ్యానర్లు, తాత్కాలిక పార్టీ కార్యాలయాల ప్రారంభం తదితర అంశాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి పొందాలన్నారు. అభ్యర్థులు ప్రచురించే కరపత్రాలను ముందుగా జిల్లా ఎన్నికల అధికారి అనుమతితో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సరిపై చేసిన తదుపరి మాత్రమే పంపిణీ చేసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై ఏ విధమైన రాజకీయ పార్టీల ప్రచారాలు చేయడానికి వీలులేదని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న కమర్షియల్ స్థలాల్లో కూడా రాజకీయ పార్టీల ప్రచార బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయడానికి వీలు లేదని ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలని సూచించారు. నగరంలోని ప్రైవేట్ హోర్డింగ్స్, బోర్డులను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమాన ప్రాతిపదికగా కేటాయించడానికి సిటీ ప్లానర్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, తదుపరి జిల్లా ఎన్నికల అధికారి అనుమతి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన రాజకీయ పార్టీలకు కేటాయింపులు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఆర్‌ఓలు ప్రదీప్ కుమార్, వెంకట లక్ష్మీ, సునీల్, మేనేజర్ ప్రసాద్, సూపరింటెండెంట్ పద్మ, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎంసీసీ, ఎక్స్‌పెండీచర్ టీంలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేయాలి..

సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ చాంబర్ లో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ బందాలు తమకు కేటాయించిన విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సీ విజిల్ యాప్ లో అందే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోను నిర్దేశిత సమయంలో హాజరై పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్టంగా అమలు చేయాలని, నిబంధనలు పాటించని రాజకీయ పార్టీల అభ్యర్థులపై కేసులు నమోదు చేయాలన్నారు. బృందం పరిధిలో అనుమతి లేకుండా ప్రచారాలు, ర్యాలీలు చేసినా, అనధికార నగదు తరలించినా వెంటనే కేసులు నమోదు చేయలని, బృందంలో పోలీసు సిబ్బంది మరింత బాధ్యతగా విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అతిక్రమించిన వారు ఎవరైనా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్దేశిత సెక్షన్‌ల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బందాలు ఎక్స్పెండీచర్ టీంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో అక్రమాలను అడ్డుకోవడంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ ముందుండాలని, క్షేత్ర స్థాయిలో ఏ సమస్య ఎదురైనా తక్షణం తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో సెక్టోరల్ అధికారి శ్రీధర్, ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ నాగేంద్ర కుమార్, ఎక్స్పెండీచర్ టీం, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై ఆందోళన చెందవద్దు

- మందులు క్రమం తప్పకుండా వాడితే కట్టడి
- ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి



గుంటూరు మెడికల్: ప్రపంచవ్యాప్తంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి బాధితులపై ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉండటం చాలా ఆందోళనకరమైన, బాధాకరమైన విషయమని ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, హెల్ప్ హాస్పటల్ అధినేత డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష తొలగించేలా 2030 నాటికల్లా హెచ్‌ఐవీ నిర్మూలనే లక్ష్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం గుంటూరు అరండల్‌పేటలోని హెల్ప్ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24వరకు కేరళలోని కొచ్చిన్‌లో ఎయిడ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు జరిగిందన్నారు. సదస్సులో పలు దేశాలకు చెందిన హెచ్‌ఐవీ ఎయిడ్స్ చికిత్స నిపుణులు విచ్చేసి తాము కనుగొన్న నూతన చికిత్స విధానాల గురించి వివరించారన్నారు. అన్ డిటెక్టబుల్ (యూ) అన్ ట్రాన్స్‌ఫ్యూజన్ (యూ) అనే నినాదంతో హెచ్‌ఐవీ నియంత్రణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. హెచ్‌ఐవీ వైరస్ వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో కనిపించకపోతే వారి ద్వారా హెచ్‌ఐవీ సోకదనే విషయం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. హెచ్‌ఐవీ వైరస్ కణాల్లో ఉండే జన్యువుల్లో ఉంటుందని, రక్తంలో ఉండదని, తద్వారా ఎయిడ్స్ వ్యాప్తి చెందదన్నారు. హెచ్‌ఐవీ అనుమానం ఉన్నవారు ఆరునెలలపాటు వైద్య పరీక్షల అనంతరం క్రమం తప్పకుండా మందులు వాడి మళ్లీ పరీక్ష చేయించినప్పుడు హెచ్‌ఐవీ వైరస్ పరీక్షలో కనిపించకపోతే వారి ద్వారా హెచ్‌ఐవీ వైరస్ సోకదనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. 95 శాతం హెచ్‌ఐవీ బాధితులను గుర్తించి, 95 శాతం వారు క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా 95 శాతం హెచ్‌ఐవీ వైరల్ తక్కువగా ఉంటే 2030కల్లా హెచ్‌ఐవీ నిర్మూలన చేయడం సాధ్యమనే విషయాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ సదస్సు ద్వారా వెల్లడించిందన్నారు. హెచ్‌ఐవీ బాధితులు ప్రతిరోజూ మందులు వాడే పనిలేకుండా నెలకు ఒకసారి లేదా, మూడునెలలకొకసారి లేదా, ఆరు నెలలకొకసారి ఇంజక్షన్ చేయించుకోవడం ద్వారా హెచ్‌ఐవీ కట్టడి చేయవచ్చు అన్నారు. ప్రస్తుతం ఈ ఇంజక్షన్లు యూరప్ దేశాల్లో అందుబాటులో ఉన్నాయని, త్వరలోనే ఇండియాకు ఇంజక్షన్లు అందుబాటులోకి వస్తాయన్నారు. హెచ్‌ఐవీ ఉన్నవారిలో సెప్సిస్ ఇన్‌ఫెక్షన్‌ను ఏవిధంగా గుర్తించాలనే విషయంపై జాతీయ సదస్సులో తాను పేపర్ ప్రజెంటేషన్ చేసి మాట్లాడానన్నారు. త్వరితగతిన హెచ్‌ఐవీ బాధితుల్లో సెప్సిస్‌ను గుర్తించడం ద్వారా ప్రాణాలు పోకుండా కాపాడవచ్చనే విషయంపై వివరించానన్నారు. హెచ్‌ఐవీ నిర్మూలన దిశగా ప్రయత్నాలు జరుగుతున్న దృష్ట్యా ప్రజలు బాధితుల పట్ల వివక్షను విడనాడాలని డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు.

నగరంలో పోలీసు కవాతు



పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట పోలీసులు మంగళవారం పోలీసు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్తపేట పీఎస్ సిబ్బంది, కేంద్ర బలగాలు, సీఆర్‌సీఎఫ్ సిబ్బందితో కలిసి కొత్తపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ అన్వర్‌బాషా కవాతు నిర్వహించారు. కొత్తపేట, మాయాబజారు, పాతూరువారితోట, గుంటూరువారితోట, ఆర్టీసీ బస్టాండ్, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, 60 అడుగుల రోడ్డు, రామిరెడ్డితోట, నెహ్రూనగర్, బుచ్చయ్యతోట, రైలుపేట ప్రాంతాల్లో కవాతు జరిగింది.

జాబ్‌డ్రైవ్‌లో 37 మందికి ఉద్యోగాలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం బెంగళూరుకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్ (ఐఎల్‌ఎం) సంస్థ నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో 37 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి తెలిపారు. కళాశాల ప్రాంగణంలోని జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌కు వివిధ కళాశాలల నుంచి వచ్చిన 156 మంది విద్యార్థులకు మౌఖిక పరీక్షలో భాగంగా కమ్యూనికేటివ్, ఇంటరాక్షన్ స్కిల్స్‌ను పరీక్షించి తుది విడతకు 62 మందిని ఎంపిక చేశారు. వారిలో గ్రూప్ డిస్కషన్ తరువాత 37 మందిని కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ ఫ్యాకల్టీ పోస్టులకు ఎంపిక చేశారు. ఐఎల్‌ఎం ప్రతినిధి గౌస్ పాషా, జేకేసీ సమన్వయకర్త కె.అపర్ణ సీతారామ్, జేకేసీ మెంటార్ యూనిస్‌ఖాన్ పాల్గొన్నారు.

పెమ్మసాని ముస్లింలకు క్షమాపణ చెప్పాలి

లక్ష్మీపురం : తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని సద్దాం హుస్సేన్ పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకొని ముస్లిం సమాజానికి క్షమాపణలు చెప్పాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం మనోభావాలను దెబ్బతీసేలా భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ నేతలు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వెంటనే పెమ్మసాని ముస్లింలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీలో ఉన్న ముస్లింలు పెమ్మసానికి బుద్ధి చెప్పాలని కోరారు.

ఏప్రిల్ 1న ఓపీ విభాగాల్లో కంప్యూటరీకరణ



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆసుపత్రి ఓపీ విభాగాలన్నింటినీ కంప్యూటరీకరణ చేస్తున్నట్లు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. మంగళవారం ఆసుపత్రిలోని ఓపీ విభాగాలను ఆయన పరిశీలించారు. ప్రతి ఓపీలోను పుస్తకాల్లో రోగి వివరాలను రాస్తుండటంపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రికి అవసరమైన కంప్యూటర్లు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని ఎందుకు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని సంబంధిత అధికారులను ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మొత్తం 28 ఓపీ విభాగాలు పని చేస్తున్నాయని, ఈ విభాగాల్లో ఇప్పటివరకు పుస్తకాల్లోనే పేషంట్ పేరు, అడ్రెస్స్ వంటి వివరాలను నమోదు చేసుకుంటున్నారని దీని వల్ల రోగులకు సేవలు అందడంలో కొంత జాప్యం జరుగుతుందన్నారు. ఇక నుంచి రోగులకు సేవలు అందించే విషయంలో జాప్యం జరగకుండా ఉండేందుకు కంప్యూటర్లను అందుబాటులోకి తీసుకుని రావాలని ఆదేశించారు. పుస్తకాల్లో రాయడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని సమయం వృథా అవుతుందని అందుకని వెంటనే కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఓపీ విభాగంలో పనిచేసే సిబ్బందికి కంప్యూటర్ పై శిక్షణ ఇప్పించాలని చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి అన్ని విభాగాలు కంప్యూటరీకరణ చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మెషిన్‌లో భాగంగా పేపర్‌లెస్ హాస్పిటల్‌గా మార్చాలని, ఓపీ మాడ్యూల్‌ని మొదలు పెట్టాలని ఆదేశించారు

క్రైస్తవుల అభ్యున్నతికి సీఎం జగన్ విశేష కృషి

- వైఎస్సార్ సీపీ గెలుపు కోసం క్రైస్తవ సమాజం ఐక్యతతో కృషి
- పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి డాక్టర్ పోలే ముత్యం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పోలే ముత్యం

నెహ్రూనగర్: స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకు ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయనివిధంగా భారతదేశ చరిత్రలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవుల అభివృద్ధి అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి డాక్టర్ పోలే ముత్యం పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు సముచిత స్థానం కల్పించి క్రైస్తవులకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చి, వారి రక్షణ, అభివృద్ధికి పునాదులు వేసి బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరిచేందుకు, ఎన్నికల్లో వారి గెలుపునకు కృషి చేసేందుకు రాష్ట్రంలోని క్రైస్తవ సమాజమంతా ఐక్యతతో ఏకతాటిపైకి వచ్చి కృషి చేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి క్రైస్తవులకు ప్రత్యేక స్థానం కల్పించి వారి అభివృద్ధికి కృషి చేశారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యంగా గుంటూరు పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి క్రైస్తవులంతా కృషి చేయాలన్నారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎం జోసఫ్ మాట్లాడుతూ క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఈనాడు పత్రికలో ప్రచురించడం సిగ్గుచేటన్నారు. క్రైస్తవులను కించపరిచే విధంగా రోత రాతలు రాసే రామోజీరావుకు తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ సమావేశంలో జోనల్ ఇన్‌చార్జి కేజే విక్టర్ పాల్, రాష్ట్ర కార్యదర్శి కె.భక్త పాల్, కృష్ణా జిల్లా కార్యదర్శి పి.జాకబ్ కుమార్, కొదమల ఎలైజా, డొక్కా సురేష్, వాసిమళ్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్‌పై నుంచి పడి బాలిక మృతి

మరొకరికి గాయాలు

గుంటూరు రూరల్: హోలీ ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ బిల్డింగ్ రెండవ ఫోర్‌నుంచి కిందపడి బాలిక మృతి చెందగా మరొక బాలుడు తీవ్రగాయాలపాలైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గోరంట్ల గ్రామానికి చెందిన వీరపనేని చిన్నయ్యకు ఒక కుమార్తె కుమారుడు ఉన్నారు. మంగళవారం హోలీ పండుగ కావటంతో కొడుకు, కుమార్తె వారి స్నేహితులతో కలిసి గోరంట్ల వెంకటేశ్వర కాలనీలోని తమ ఇంటిలో రెండవ ఫ్లోర్‌లో హోలీ ఆడుకుంటున్నారు. అయితే ప్రమాదవశాత్తూ కుమార్తె అలేఖ్యలక్ష్మి(18), కుమారుడు అజయ్ చంద్రమణికంఠలు బిల్డింగ్‌పై నుంచి కిందపడ్డారు. ప్రమాదంలో అలేఖ్యలక్ష్మి తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, మణికంఠకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు గమనించి మణికంఠను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. మృతురాలు అలేఖ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సకల సౌభాగ్యాలు ఇచ్చే అమ్మవారు

- మంత్రి విడదల రజిని
- నిదాంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయంలో మంత్రి పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి విడదల రజిని

పట్నంబజారు: లోక కల్యాణం కోసం భూమిపై పార్వతిదేవి అవతారమే నిదానంపాటి లక్ష్మీ అమ్మవారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. స్థానిక నల్లచెరువు 12వలైను ఎల్‌బీనగర్‌లో ఉన్న శ్రీనిదానంపాటి లక్ష్మీ అమ్మవారి త్రిశక్తి పీఠంలో మంగళవారం మంత్రి రజిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సకల సౌభాగ్యాలు ఇచ్చే దేవత నిదానంపాటి అమ్మవారు అన్నారు. 28వ డివిజన్ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, మాలమహానాడు నగర అధ్యక్షుడు జె.వి.ఎస్.నాగరాజు ఆహ్వానం మేరకు మంత్రి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జె.బాలఅంకయ్య (స్వామి), కమిటీ సభ్యులు మంత్రి రజినిని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు పెద్ద అంకాలు, సురేష్, రామారావు, సాయి, శ్రీనివాసులు, విఘ్నేష్, లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ నేతలు నర్సిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన కిలారి రోశయ్య



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న కిలారి వెంకటరోశయ్య

గుంటూరు ఈస్ట్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య మంగళవారం జీజీహెచ్ అత్యవసర విభాగంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వైద్యులను వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈసందర్భంగా కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ పెదనందిపాడు మండలం పాలపర్తి రోడ్డులో అప్పాపురంకు చెందిన వ్యవసాయ కూలీలు ఆటోలో ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారన్నారు. మొత్తం 12 మంది గాయపడగా, వారిలో ఆరుగురికి తీవ్రగాయాలు అయ్యాయని, క్షతగాత్రులను జీజీహెచ్‌లో వైద్య చికిత్స అందిస్తున్నారన్నారు. కాలు తెగిపడిన బాలికకు ప్రత్యేక చికిత్స అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వం నుంచి సహాయం అందజేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

పాత గుంటూరు: కొరిటెపాడు ఆంజనేయపేటలోని లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వాముల తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం గణపతి పూజ, చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వాముల వారికి పంచామృతాలతో అభిషేకం జరిగింది. సాయంత్రం కోలాట బృందం చేసిన ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకుడు కన్నసాని విజయ్ కుమార్, రవికుమార్, బాజి పర్యవేక్షించారు.

దేశ చరిత్రలోనే ఎలక్టోరల్ బాండ్ల డేటా అతిపెద్ద స్కాం

అవగాహన సంస్థ చర్చలో విశ్లేషకులు, విద్యావేత్తలు

లక్ష్మీపురం: దేశ చరిత్రలోనే అతి పెద్ద స్కాంగా పేరొందినదే ఎలక్టోరల్ బాండ్ల డేటా అని బాండ్ల రూపంలో ఆయా ప్రభుత్వాలకు ముడుపులు ముట్టజెప్పిన వారందరూ ప్రభుత్వాలు నుంచి విస్తృత స్థాయిలో ప్రయోజనాలు పొందిన వారేనని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివారమిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎలక్టోరల్ బాండ్లు - అవినీతి అనే అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన 41 కంపెనీలు కేంద్ర ఏజెన్సీలు దాడులు ఎదుర్కొన్నవేనని ఆ కంపెనీల నుంచి అధికారంలో ఉన్న బీజేపీకి రూ.2,471 లక్షల కోట్లు అందిన మాట వాస్తవమన్నారు. ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి విరాళం ఇచ్చిన 33 కంపెనీలు 172 మేజర్ కాంట్రాక్టులను ప్రాజెక్టు అనుమతులను కేంద్ర ప్రభుత్వం నుంచి పొందారన్నారు. ఈ విధంగా పొందిన కాంట్రాక్టుల ప్రాజెక్టుల విలువ మొత్తం రూ.3.7 లక్షల కోట్లు అని అన్నారు. విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ రాజాయగ విరుద్ధమైన ఎలక్టోరల్ బాండ్ల పథకం కింద కనీసం 30 డొల్ల కంపెనీలు రూ.143 కోట్లు విలువైన బాండ్లను కొనుగోలు చేశాయన్నారు. అనంతరం పలువురు సంస్థ సభ్యులు చర్చలో పాల్గొని ప్రసంగించారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందరూ వినియోగించాలి

ఎఫ్‌సీఐ తాడేపల్లి డిపో మేనేజర్లు వర్గీస్, ధనుంజయ్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ తాడేపల్లి డిపో మేనేజర్ ధనుంజయ్

తాడేపల్లిరూరల్: అధిక పోషక విలువలు కలిగివున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందరూ వినియోగించాలని ఎఫ్‌సీఐ తాడేపల్లి డిపో మేనేజర్లు వర్గీస్, ధనుంజయ్ అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి అంజిరెడ్డి కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేనేజర్ క్యూసి రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రక్తహీనతను పోగొట్టే ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నామని అన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి విటమిన్లు పుష్కలంగా లభిస్తాయని వివరించారు. బియ్యాన్ని కడిగినప్పుడు వచ్చే నీటిలో అనేక పోషకాలు ఉంటాయని తెలిపారు. తాడేపల్లి ఎఫ్‌సీఐ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి: ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు జరిగేలా ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి సూచించారు. మంగళవారం నియోజవకవర్గంలో ఏర్పాటు చేసిన 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో సమావేశం నిర్వహించి పలు జాగ్రత్తలు సూచించారు. తొలుత రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద, తాత్కాలిక కేంద్రాల వద్ద నిబంధనల అతిక్రమించారా, లేదా అని స్వయంగా పరిశీలించారు. అనంతరం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లతో మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగ్‌లు, బ్యానర్‌లు, ఫ్లెక్సీలు కనిపిస్తే వెంటనే తొలగించాలని ఆదేశించారు.

తనిఖీల్లో రూ.99వేలు స్వాధీనం

మేడికొండూరు: మండల పరిధిలోని కొర్రపాడు చెక్ పోస్టు వద్ద అనధికారికంగా తరలిస్తున్న రూ. 99వేలు నగదును మండల తహసీల్దార్ రాజ్యలక్ష్మి, మేడికొండూరు పోలీసులు తనిఖీల్లో పట్టుకున్నారు. తహసీల్దారు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల్లో భాగంగా మేడికొండూరు మండలంలో వాహనాలు తనిఖీలు జరుగుతున్నాయన్నారు. అధిక మొత్తంలో నగదు తరలిస్తే అలాంటివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తరలించాలంటే సంబంధిత అధికారుల వద్ద అనుమతులు తీసుకోవాలని రాజ్యలక్ష్మి తెలిపారు. పట్టుబడిన నగదును అధికారులకు అప్పజెప్పారు.